
ఖిల్లా మైసమ్మ ఆలయంలో క్యూలో భక్తులు


సాయినగర్‌లోని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి తదితరులు


చైతన్యనగర్‌లోని అమ్మవారి ఆలయంలో బోనాల ఉత్సవాల్లో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, కాలనీ అధ్యక్షుడు తిప్పర్తి జలంధర్‌రెడ్డి


వాసవీ నిలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

# వైభవంగా బోనాల సంబురాలు

- ఎన్టీఆర్‌నగర్‌లోని ఖిల్లా మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి సీతక్క
- కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు


భక్తులతో కిటకిటలాడుతున్న ఖిల్లా మైసమ్మ ఆలయం


ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని ఖిల్లా మైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డికి అర్చకుల ఆశీర్వాదాలు

**జోన్ బృందం :** ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల నడుమ బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని ఖిల్లా మైసమ్మ ఆలయంలో అమ్మవారికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి ఖిల్లా మైసమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసి ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, తీగల అనితారెడ్డిలతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో బోనాల వేడుకల్లో పలువురు కార్పొరేటర్లు, రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా కోర్టుల ఆవరణలో..

**రంగారెడ్డి జిల్లా కోర్టులు :** రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో ఆదివారం ఆషాఢ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. న్యాయసేవాధికార సంస్థ నుంచి దగ్గర్లోని అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించి బోనాలు సమర్పించారు. ఈ వేడుకలలో న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో హైకోర్టు జీపీ అనంతసేనారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణ, సాయిరెడ్డి, శ్రీనాథ్, రామారావు, పులిగారి గోవర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.


మన్సూరాబాద్ పోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాల్లో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి


అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వచ్చిన భక్తులు


స్నేహమాయినగర్‌లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముద్దగౌని చంద్రకాంత్‌గౌడ్ తదితరులు


వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో జడ్పీ మాజీ చైర్మన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి, భుజంగరెడ్డి


చంపాపేటలోని నల్ల, ఎర్రపోచమ్మ ఆలయంలో భక్తుల కిటకిట


పోచమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు


డీఎస్‌నగర్ ఆలయంలో కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి దంపతులు


విష్ణునగర్‌లో పోతురాజుల విన్యాసాలు


ప్రసన్న మహాకాళి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ పవన్‌కుమార్


నల్లపోచమ్మ ఆలయ బోనాల ఊరేగింపులో శివశక్తులు


సైదాబాద్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వప్నారెడ్డి


జీవనజ్యోతి సంఘం జయదుర్గాదేవిని దర్శించుకున్న సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్


ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

## ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ సేల్ మేళా

**వనస్థలిపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి):** వనస్థలిపురం ఒపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్‌కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్, లక్నో చికెన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్, ఇతరఅనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్త కళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30ల నుంచి రాత్రి 9గంటల వరకు కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని అక్బర్‌అలీ పేర్కొన్నారు.

## నేడు సైదాబాద్‌లో ఘటాల ఊరేగింపు

**సైదాబాద్ :** సైదాబాద్‌లో ఘటాల ఊరేగింపు సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు శ్రద్ధాబాద్ మహాకాళి జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ సుభాష్‌చందర్జీ తెలిపారు. సాయంత్రం జరిగే అమ్మవారి గావు, ఫలహార బండ్ల ఊరేగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రాజాసింగ్, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, యెగ్గె మల్లేశం తదితరులు హాజరు కానున్నారని వివరించారు.

## శాకంబరి అలంకరణలో ప్రత్యంగిరా అమ్మవారు

**ఎల్‌బీనగర్, జూలై 28(ఆంధ్రజ్యోతి):** ఆషాఢ మాసం సందర్భంగా ఆర్‌కేపురంలోని కుర్తాళ పీఠం వారాహి సమేత ఆదిపరాశక్తి ప్రత్యంగిరా పరమేశ్వరి మందిరంలో అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తుల తాకిడి మొదలైంది. మధ్యాహ్నం వరకు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ప్రత్యేక పూజాధికాలలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించడం జరిగిందని ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో అనుగ్రహాష్టమి అనుఘాదేవి దత్త వ్రతం

**కొత్తపేట:** ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆకాంక్షించారు. కొత్తపేటలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆదివారం ఐవీఎఫ్ రాష్ట్ర మహిళా విభాగ్ ప్రధాన కార్యదర్శి మంజుల, రాజుల ఆధ్వర్యలో అనుగ్రహాష్టమి అనుఘాదేవి దత్త వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, స్వప్న దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలు బాగుండాలని, గణపతి సచ్చిదానందస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని అన్నారు. కార్యక్రమంలో నాగోల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బీపతి, ఐవీఎఫ్ యూత్ కోశాధికారి నరేష్, సంపత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## కులగణన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య

**బర్కత్‌పుర, జూలై 28 (ఆంధ్రజ్యోతి):** కులగణన చేపట్టి, పూర్తి చేసిన తరువాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగె మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో 14 బీసీ సంఘాలు, 22 బీసీ కుల ఉద్యోగ సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ, గత కేసీఆర్ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 20శాతానికి కుదించిందని ఆరోపించారు. రాష్ట్రంలో కులగణన చేపట్టడానికి న్యాయపరమైన అడ్డంకులు ఏమీ లేవన్నారు. కులగణన చేపట్టకుండా, రిజర్వేషన్ల శాతాన్ని పెంచకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, దీనిని తీవ్రంగా ఎదుర్కొంటామని ఆయన హెచ్చరించారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు ఎర్ర సత్యనారాయణ, సి. రాజేందర్, జిల్లపల్లి అంజి, బిల్లా దీపిక, పగిళ్ల సతీష్, మోది రాందేవ్, మట్టా జయంతిగౌడ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మిధానీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ తమ్‌హంకర్ జయంతి వేడుకలు

**చంపాపేట:** మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్(మిధానీ)వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఆర్‌వీ.తమ్‌హంకర్ 107వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కంచన్‌బాగ్‌లోని మిధానీ ప్రాంగణంలో తమ్‌హంకర్ విగ్రహానికి మిధానీ సీఎండీ డాక్టర్ సంజయ్‌కుమార్ షా పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మిధానీ ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్.గౌరీశంకర్, ప్రొడక్షన్, మార్కెటింగ్ డైరెక్టర్ ముత్తుకుమార్, మిధానీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు త్రివేది, నారాయణరావు, రాములునాయక్ పాల్గొన్నారు.

## అనాథాశ్రమానికి నిత్యవసర వస్తువుల అందజేత

**చంపాపేట :** లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, హైదరాబాద్ సెంచరీయల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చంపాపేట సమీపంలోని కారుణ్యసింధు, వైదేహీ ఆశ్రమంలోని అనాథ విద్యార్థులకు శనివారం రాత్రి 60వేల విలువైన నిత్యవసర వస్తువులను క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, సభ్యుల చేతుల మీదుగా అందజేశారు. వైదేహి ఆశ్రమంలో 75మంది, కారుణ్య సింధు ఆశ్రమంలోని 25 మందికి నిత్యవసర వస్తువులను అందజేశారు.

## స్లాప్ రాష్ట్ర అధ్యక్షుడిగా రమేష్ ఏకగ్రీవం



స్లాప్ నూతన కమిటీ సభ్యులు

**అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 28(ఆంధ్రజ్యోతి):** సొసైటీ ఆఫ్ లెప్రసీ ఎఫెక్టెడ్ పర్సన్స్(స్లాప్) రాష్ట్ర అధ్యక్షుడిగా పెద్దఅంబర్‌పేట్‌లోని శాంతినగర్‌కాలనీకి చెందిన ఎం.రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో అసోసియేషన్ ఆఫ్ పీపుల్ ఎఫెక్టెడ్ పర్సన్(ఏపీఏఎల్) నిర్వహించిన సమావేశంలో జాతీయ అధ్యక్షురాలు మాయరనవారే సమక్షంలో స్లాప్ రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా అనసూయ, కోశాధికారిగా ఇమ్మానియేల్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ లెప్రసీ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏపీఏఎల్ కోశాధికారి దోనే ప్రకాష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ ఉపకులాల మహాధర్నాను విజయవంతం చేయాలి

**హయత్‌నగర్:** ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 9న ఢిల్లీలో నిర్వహించనున్న మాదిగ ఉపకులాల మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ఉపకులాల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి భానాల మంగేష్ కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య, ఎస్సీ ఉపకులాల రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం ఆధ్వర్యంలో ఆగస్టు 9న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నాను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గంలోని 57 ఉపకులాల నాయకులు ఈ సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. నేటికి మాదిగ ఉపకులాలు ఊరురా తిరుగుతూ భిక్షాటన చేస్తూ కాలం వెల్లదీస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వారి పిల్లలకు ఉన్నత చదువులు లేక ఉద్యోగాలకు దూరమైనట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధిస్తే ఉపకులాలకు మేలు చేకూరుతుందన్నారు.

## బైక్ సీటు కోశాడనే అనుమానంతో ఇంటి ఎదుట పార్కు చేసిన బైక్‌లకు నిప్పు

- పూర్తిగా దగ్ధమైన 7 బైక్‌లు


మంటల్లో కాలిపోతున్న బైక్‌లు

**అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 28(ఆంధ్రజ్యోతి):** గతంలో తన బైక్ సీటు కోశాడనే అనుమానంతో ప్రత్యర్థి ఇంటి ఎదుట పార్కు చేసిన బైక్‌కు నిప్పంటించాడు. ఆ మంటలు కాస్తా పక్కన పార్కు చేసిన బైక్‌లకు అంటుకుని పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పరిధిలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి చెందిన మహేందర్, శివకు చెందిన బైక్‌ను గతంలో దీవీస్, విజయ్ అనే వ్యక్తులు సీటు కోశారనే అనుమానాలు ఉన్నాయి. దీంతో వారిపై మహేందర్, శివ కక్ష పెంచుకున్నారు. కాగా శనివారం రాత్రి దీవీస్, విజయ్ ఇంటి ఎదుట పార్కు చేసిన బైక్‌లకు మహేందర్, శివ మరో ఇద్దరి సహకారంతో బైక్‌లకు నిప్పంటించారు. 125 ప్లాట్ ముందు ఉన్న 3బైక్‌లకు, 141 ప్లాట్ ముందు పార్కు చేసిన 4బైక్‌లకు మంటలు అంటుకుని పూర్తిగా కాలి పోయాయి. దీంతో బాధితులు ఆదివారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అనుమానితులైన మహేందర్, శివతో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ఫామ్‌హౌస్‌ల్లో మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

## మూడు ఫామ్‌హౌస్‌లపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

- అనుమతుల్లేని లిక్కర్ వినియోగంపై కేసులు

**హైదరాబాద్ సిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి):** అనుమతుల్లేకుండా మద్యం వినియోగిస్తున్న వారిపై ఎక్సైజ్ శాఖ అధికారులు కొరఢా ఝులిపిస్తున్నారు. అనుమతులు లేకుండా మద్యం వినియోగంతోపాటు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను వినియోగిస్తు ఉండడంపై ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి నగర శివారుల్లోని రెండు ఫామ్‌హౌస్‌లపై దాడిచేసిన అధికారులు.. అనుమతుల్లేకుండా మద్యం వినియోగిస్తున్న నిర్వాహకులపై కేసులు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలో చేవేళ్ల ప్రాంతంలోని తొమ్మిది ఫామ్ హౌస్‌లను తనిఖీలు చేశారు. రెండు ఫామ్ హౌసుల్లో అనుమతిలేకుండా మద్యం వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అత్తాపూర్‌లోని మెగా ఫామ్‌హౌస్, సురంగల్‌లోని ఎస్ఎంఆర్ ఫామ్‌హౌస్‌లో ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేసి లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెంట్ కృష్ణప్రియ తెలిపారు. 48 బీర్లు, 14 ఫుల్ బాటిళ్లమద్యం పట్టుకున్నారు. పట్టుబడ్డ మద్యం తెలంగాణకు సంబంధించినది కాకపోవడంతో ఎన్‌డీపీఎల్ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఎన్నిసార్లు హెచ్చరించినా వినకుండా ఫామ్ హౌస్‌ల్లో అనుమతిలేని మద్యం వినియోగిస్తున్నారని, ఇలాంటి కేసుల్లో ఫామ్ హౌస్ యజమానులతోపాటు, మద్యం వినియోగించిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. అంతేకాకుండా ఆ ఫామ్ హౌస్‌లను బ్లాక్ లిస్టులో పెడుతామని అధికారులు హెచ్చరించారు.

### మేడిపల్లిలో మరో కేసు..

మేడిపల్లి పరిధిలోని సావి సెరేంట్‌లీ అనే ఫామ్‌హౌజ్‌లో శనివారం రాత్రి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ దాడులు నిర్వహించినట్లు అసిస్టెంట్ కమిషనర్ కిషన్ తెలిపారు. ఈ కేసులో 2.25 లీటర్ల డిఫెన్స్ మద్యం, 3.85 లీటర్ల ఐఎంఎల్ (అనుమతి లేని) మద్యం, 6.68 లీటర్ల బీరును స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లాలో చేవేళ్ల పరిధిలో ఫామ్ హౌజ్‌లు అధికంగా ఉన్నాయి. అనుమతిలేని మద్యాన్ని ముందుగా అనుమతించవద్దని అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. ఈ ఫామ్ హౌజ్‌ల యాజమానులు నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అనుమతించకూడదన్నారు.

## ఇంట్లో నగలు, నగదు చోరీ..

- పని మనుషులపై అనుమానం

**చాదర్‌ఘాట్:** తాళం వేసి ఉన్న ఇంట్లో నుంచి నగలు, నగదు చోరీ జరిగిన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈనెల 26వ తేదీన జరిగిన సంఘటన పూర్వాపరాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. మలక్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసారాంబాగ్‌లోని జహీర్ రెసిడెన్సీలో నివాసముంటున్న డాక్టర్ ఆయేషా ఫర్హీన్ తన ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లింది. ఈనెల 26వ తేదీన తన బెడ్రూంలోని డ్రా తెరచి చూడగా అందులోని 8.5తులాల బంగారు నగలు, రూ.17,500 నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు అనుమానించి మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో అదే రోజున ఫిర్యాదు చేసింది. ఇందులో ఆరు బంగారు కంకణాలు, రూబీ పొదిగిన బ్యాంగిల్ ఉందని ఆమె వివరించింది. ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ మధ్యలోనే ఈ చోరీ జరిగి ఉంటుందని డాక్టర్ ఆయేషా ఫర్హీన్ తన ఫిర్యాదులో వివరించింది. చోరీ జరిగిన నగలు, నగదు విలువ రూ.3.75లక్షల వరకు ఉంటుందని తెలిపింది. తన ఇంట్లో పని చేసే పనిమనుషులైన అను, కౌసర్, ఇన్షాలపై అనుమానం వ్యక్తం చేసింది. మలక్‌పేట పోలీసులు ఈముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.